కుక్కల బెడద తొలగించండి

• 'సాక్షి' ఫోన్‌ఇన్ ద్వారా ప్రజల విజ్ఞప్తి • పరిష్కరిస్తామన్న ఇన్‌చార్జి కమిషనర్ వెంకటలక్ష్మి


సమాధానాలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ వెంకటలక్ష్మి

మెట్‌పల్లి(కోరుట్ల):మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు ఇన్‌చార్జి కమిషనర్ వెంకటలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. 'సాక్షి' ఫోన్‌ఇన్ ద్వారా పలు వార్డుల ప్రజలు కుక్కలు, కోతుల బెడద, పారిశుధ్యం, తాగునీటి కొరత, మౌలిక వసతులు తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే వీటిని పరిష్కరిస్తామని వెంకటలక్ష్మి హామీ ఇచ్చారు.

వారి మాటల్లోనే..

- 1, 6, 9వార్డుల్లో కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం?
- కంభ శంకర్, ఇర్ఫాన్, అజీమ్, సాజిద్
- వెంకటలక్ష్మి : బెడద ఉన్నప్రాంతాలను గుర్తించాం. ఈసమస్యపై ఫిర్యాదులు కూడా బాగా వస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశలతో త్వరలోనే వాటిని పట్టుకుని జనావాసాలకు దూరంగా తరలిస్తాం.
- మిషన్ భగీరథ కోసం రేగుంటలో తవ్విన గుంతలు ఇంకా పూడ్చడం లేదు. డ్రైనేజీలనూ శుభ్రం చేయడంలేదు. దుర్వాసన భరించలేకపోతున్నం.
- సంతోష్‌రెడ్డి, 13వ వార్డు
- వెంకటలక్ష్మి : భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లి గుంతులు పూడ్చివేయిస్తాం. డ్రైనేజీలు శుభ్రం చేయిస్తాం.
- వెంకట్రావ్‌పేట శివారు నివాసాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చినా నీళ్ల రావడం లేదు. వేసవిలో బోర్లు కూడా ఎండిపోతున్నాయి?
- భీమ్‌శెట్టి, 11వ వార్డు
- వెంకటలక్ష్మి : నీటిసరఫరాలో సమస్య పరిష్కరిస్తాం.
- హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో శుభ్రత పాటించడం లేదు. డ్రైనేజీల్లో చెత్త తొలగించడం లేదు. ఫాగింగ్ చేయడంలేదు. దోమల బెడద తీవ్రమవుతోంది. మార్కెట్‌లోని ఖబ్రస్తాన్ ముందు గుంత పూడ్చడంలేదు.
- ఖత్ముద్దీన్, మైనార్టీ నాయకుడు
- వెంకటలక్ష్మి: హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లల్లో తనిఖీలు చేయిస్తాం. డ్రైనేజీల్లో చెత్త తొలగిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. 9వార్డుపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఖబ్రస్తాన్ ముందు గుంతను వెంటనే పూడ్చివేయిస్తాం.
- 20వార్డుల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్నాయి?
- కడకుంట్ల దశరథం
- వెంకటలక్ష్మి: విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.
- వెంకట్రావ్‌పేటలోని ఓ వీధిలో రోడ్డుపైనే రేకులు వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది?
- కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, 11వ వార్డు
- వెంకటలక్ష్మి: నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వేసిన రేకులు తొలగిస్తాం.

నివాసాల్లో మురుగునీరు నిలుస్తోంది

- సమస్యల గురించి వివరించిన ప్రజలు
- పరిష్కరిస్తామని 'సాక్షి' ఫోన్ ఇన్‌లో సమాధానం ఇచ్చిన మున్సిపల్ కమిషనర్ రమేశ్


సీహెచ్ రమేశ్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి

ధర్మపురి: మున్సిపల్ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ సీహెచ్ రమేశ్ తెలిపారు. 'సాక్షి' చేపట్టిన ఫోన్‌ఇన్ ద్వారా పట్టణవాసులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. వారి మాటల్లోనే..

- నివాసాల్లోనే మురుగునీరు నిల్వ అయి దుర్గంధం వెదజల్లుతోంది. ఇబ్బందిగా ఉంది?
- జక్కుల లక్ష్మి ఆరో వార్డు
- రమేశ్: మురుగునీటిని తొలగించేందుకు తాత్కాలికంగా పైపులైన్ నిర్మిస్తాం. ఆ తర్వాత డ్రైనేజీలు నిర్మిస్తాం.
- కళాశాల మైదానంలో ఉదయం చెత్త కాల్చుతున్నారు. పొగతో వాకింగ్ చేసేవాళ్లకు అంతరాయం కలుగుతోంది. ప్లాస్టిక్ కవర్ల వాడకం పెరిగింది.
- రంగు లక్ష్మీనరహరి, పదోవార్డు
- రమేశ్ : పొగ నివారణకు తక్షణ చర్యలు చేపడాతం. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా విధిస్తాం.
- తాగునీటి సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది? కొత్తగా ఇళ్లు నిర్మించుకున్న ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి.
- వేముల రాజేశ్, ఏడోవార్డు
- రమేశ్ : ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులతో పగిలిన పైపులైన్లు మరమ్మతు చేసి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాడానికి రూ.1.25 కోట్లతో ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం.
- మిషన్ భగీరథ నీరు రావడంలేదు? కోతుల బెడద తీవ్రమైంది?
- బెజ్జారపు లవన్‌కుమార్, రెండోవార్డు
- రమేశ్ : నీటిసమస్య ఉన్నప్రాంతాలు గుర్తించి తగిన చర్యలు తీసుకుంటాం. కోతుల బెడద నివారిస్తాం.
- పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులపై కుక్కలు దాడులు చేస్తున్నాయి?
- సీహెచ్ ప్రభాకర్, పదోవార్డు
- రమేశ్ : కుక్కలు, కోతుల బెడద నివారణకు ఉన్నతాధికారులు ఇటీవల జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం త్వరలో కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తాం. జంతు సంరక్షణ కేంద్రాలకు తరలిస్తాం.
- దుమ్ము సమస్య తీవ్రమై పట్టణ ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్నారు?
- పిల్లి శ్రీనివాస్, 14వవార్డు
- రమేశ్ : ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులతో దుమ్ము, ధూళి సమస్య ఎదురవుతోంది. వీటి నివారణకు నీటిని చల్లిస్తున్నాం. అభివృద్ధి పనులు పూర్తయితే ఈ సమస్య ఉండదు.

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


వార్షిక వేడుకల్లో పాల్గొన్న భక్తులు

బుగ్గారం: మండలంలోని గోపులాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ బాదినేని రాజమణితో పాటు సర్పంచ్ కొమ్మినేని సుశీల, వందలాది మంది గ్రామస్తులు హాజరయ్యారు.

పాప వైద్యానికి ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..

బుగ్గారం: మండలంలోని సిరికొండకు చెందిన గజ్జెల నరేశ్–రజిత దంపతుల ఏకైక కూతురు నాగలక్ష్మి (45రోజులు) గొంతువాపుతో పాటు ఊపిరితిత్తుల జబ్బుతో జగిత్యాల ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతోంది. పాప వైద్యం కోసం ఇప్పటికి రూ.4లక్షల వరకు ఖర్చు చేశారు. పాప తల్లిదండ్రులు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయాన్ని శనివారం సాక్షి దినపత్రికలో 'ఏడుస్తుంది పాలు తాగడంలేదు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించి మండలంలోని బీర్‌సాని గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ రూ.10వేలు అందజేశారు.

ఎంపీఎల్ అధ్యక్షుడిగా మహబూబ్


కార్యవర్గాన్ని సన్మానిస్తున్న క్రీడాకారులు

మల్లాపూర్: మల్లాపూర్ ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్) అధ్యక్షుడిగా ఎండీ.మహబూబ్‌ఖాన్(మొగిలిపేట), ఉపాధ్యక్షుడిగా రెవెల్లి ప్రవీణ్(ముత్యంపేట), కోశాధికారిగా బండి స్వామి(మల్లాపూర్)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల క్రీడాకారులు, యువకులు, ఫ్రాంచైజ్ ఓనర్స్ తెలిపారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీఎల్ కార్యవర్గాన్ని ప్రకటించారు. వారు మాట్లాడుతూ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలోనే ఎంపీఎల్ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించబోతున్నట్లు తెలిపారు. మండల క్రీడాకారులు అశ్విన్, రఫీ, కిషోర్, రవి, ప్రవీణ్, సంజీవ్, రాము, నరహరి పాల్గొన్నారు.

మెట్లచిట్టాపూర్ వీడీసీ రద్దు

మెట్‌పల్లి: మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామాభివృద్ధి కమిటీని రద్దు చేస్తూ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. గ్రామానికి చెందిన తమను వీడీసీ సామాజిక బహిష్కరణ చేసిందని ఇటీవల మున్నూరు కాపు, గుడేటి కాపు కులస్తులు ఆర్డీవో, డీఎస్పీలకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అధికారులు గ్రామంలో వీడీసీ సభ్యులతో సమావేశమై చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం సమంజసం కాదని, వెంటనే కమిటీని రద్దు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు శనివారం సభ్యులు కమిటీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రభుత్వ పాఠశాలకు వస్తువులు అందజేత


దాతను సన్మానిస్తున్న పాఠశాల చైర్మన్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అజయ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు శనివారం పలు వస్తువులు అందజేశాడు. పాఠశాలకు ప్రింటర్, మధ్యాహ్న భోజన కార్మికులకు వంటపాత్రలు, విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, వంట చేసేందుకు ఆధునిక స్టౌవ్‌తో పాటు, పాఠశాలలోని దివ్యాంగులకు సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆడెపు సునీత అజయ్‌ను సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.రజిత, ఉపాధ్యాయులు స్వరూప, తేజస్విని పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

మల్యాల: మండలంలోని గుడిపేట, ముత్యంపేట గ్రామాల్లో వ్యవసాయాధికారులు క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాలను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగును గమనించినట్లు ఏఈవో కారుణ్యకుమార్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు జగిత్యాలలో తెలంగాణ గెజిటెడ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల సమస్యలు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామని, ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడంలో అధ్యాపకులు సైతం కృషి చేయాలని సూచించారు. సమావేశంలో టీజీసీ జీటీఏ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్, కార్యదర్శి కరుణాకర్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బూత్‌స్థాయి కార్యకర్తలే పార్టీకి బలం


మాట్లాడుతున్న సాంబారి ప్రభాకర్

మల్లాపూర్: గ్రామాలు, పట్టణాల్లోని బూత్‌స్థాయి కార్యకర్తలే ప్రధాని నరేంద్ర మోదీ బలమని, వారి కృషితోనే కేంద్రంలో 300కు పైగా ఎంపీలతో వరుసగా రెండుసార్లు మోదీ ప్రధానిగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని చిట్టాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ వ్యవస్థను నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. ధరణి పోర్టల్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి దండుగుల అంజిరాజ్, బూత్ అధ్యక్షులు నవీన్‌గౌడ్, కుంట జీవన్‌రెడ్డి, ఆరెల్ల బుజ్జిగౌడ్, నాయకులు ఇట్టెడి శేఖర్‌రెడ్డి, సీమల ప్రశాంత్, పోశంపెల్లి రామకృష్ణ, అచ్చ రమేశ్, చిన్నోల్ల శంకర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ముస్లిం కమిటీ సభ్యులు


ఖురాన్ బహూకరిస్తున్న సభ్యులు

రాయికల్: కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యాస్మిన్ బాషాను శనివారం రాయికల్ ముస్లిం కమిటీ సభ్యులు కలిసి ఖురాన్ గ్రంథం బహూకరించారు. ముస్లీం మైనార్టీ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్‌ముస్తాక్ అహ్మద్, సెక్రటరీ మొబిన్, ఇంతియాజ్, నయీం, సయ్యద్ ఇమ్రాన్, నజీర్, షాకీర్, మునీర్, జలీల్ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం


పుష్పగుచ్ఛం ఇస్తున్న సివిల్ జడ్జి, న్యాయవాదులు

ధర్మపురి: మండలంలోని తిమ్మాపూర్ వాస్తవ్యులు హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి శనివారం సాయంత్రం తమ స్వగ్రామమైన తిమ్మాపూర్‌కు చేరుకున్నారు. ఈసందర్భంగా ధర్మపురి కోర్టు సివిల్ జడ్జి శ్యామ్‌ప్రసాద్‌తో పాటు న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. మాజీ పీపీ బెత్తపు లక్ష్మణ్, న్యాయవాదులు ఎర్ర నర్సయ్య, వెంకటేశ్వర్‌రావు, గడ్డం లింగారెడ్డి, బత్తిని ఇంద్రకరణ్, జాజాల రవీందర్, మామిడాల శ్రీకాంత్ ఉన్నారు.

నూతన నియామకం

పెగడపల్లి: యాదవ హక్కుల పోరాట సమితి గొల్లపల్లి మండల ఉపాధ్యక్షుడిగా గొల్లపల్లి మండలంలోని బీమ్‌రాజ్‌పల్లికి చెందిన సింగారపు లచ్చయ్య నియామకమయ్యారు.

సంక్షిప్త వార్తలు

✦మార్చిలో ఉచిత రేషన్‌బియ్యం పంపిణీ

జగిత్యాలరూరల్: జిల్లాలో ప్రతినెలా చౌకధరల దుకాణం ద్వారా ఇచ్చే రేషన్ బియ్యం ప్రభుత్వ నిర్ణయం మేరకు రాష్ట్రంలో మార్చి నెలకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. మార్చి 5 నుంచి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

✦దహన సంస్కారాలకు చేయూత

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో శనివారం భూక్య సజ్జనాయక్(59) అనే వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌తో పాటు వార్డుసభ్యులు జహిందర్, నాయకులు బిట్ల నరేశ్, గుగ్లావత్ రాజేందర్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. గ్రామపంచాయతీ నిధుల్లోంచి దహన సంస్కారాలకు రూ.10వేలు అందజేశారు. లచ్చయ్యను నియమిస్తూ మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్ శనివారం నియామకం పత్రం జారీ చేశారు.

✦నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని టౌన్–3 సెక్షన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ ఫీడర్ మరమ్మతు దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–3 ఏఈ ఎండీ.రహీం తెలిపారు. టౌన్–3 సెక్షన్ పరిధిలో భవానినగర్, ఎమ్మెల్యే క్వార్టర్స్, కరీంనగర్‌రోడ్, అయ్యప్పకాలనీ, బుడిగజంగాల కాలనీ, పద్మనాయక బ్యాక్‌సైడ్‌లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

✦మొక్కలకు జీవామృతం వేయాలి

ఇబ్రహీంపట్నం: నర్సరీల్లోని మొక్కల పెరుగుదల కోసం జీవామృతం తయారు చేసి వేయాలని ఎంపీడీవో ప్రభు సూచించారు. ఈ మేరకు శనివారం మండలంలోని అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నంలోని నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ స్రవంతి, కార్యదర్శులు నారాయణ, రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు అంజయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


✦ఆలయ స్లాబ్ పనులు ప్రారంభం

కోరుట్లటౌన్: పట్టణంలోని మాదాపూర్ కాలనీలో ముత్యాల పోచమ్మ ఆలయం స్లాబ్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య శనివారం ప్రారంభించారు. కౌన్సెలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, టీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

✦బీసీ సంక్షేమ సంఘం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేశ్

రాయికల్: రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాయికల్‌కు చెందిన గంగదరి సురేశ్, జగిత్యాల నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ధర్మాజీపేట గ్రామానికి చెందిన బల్సు రంజిత్‌కుమార్‌లను నియమించినట్లు రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ శనివారం నియామకపత్రం అందించారు.

నిషేధిత ప్లాస్టిక్ వాడొద్దు


ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

కోరుట్లటౌన్: నిషేధిత ప్లాస్టిక్ వాడొద్దని మున్సిపల్ కమిషనర్ ఎండీ.అయాజ్ అన్నారు. పట్టణంలోని కిరాణ దుకాణాలు, ప్లాస్టిక్ ఏజెన్సీలు, వివిధ షాపుల్లో మున్సిపల్ అధికారులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు తనిఖీల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను మున్సిపల్ అధికారులు పట్టుకుని, జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ బట్ట సంచుల వాడకంపై దుకాణదారులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ ఆకు అంజయ్య, మెప్మా సీవో శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సర్కారు భరోసా


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: సీనియర్ సిటిజన్లు, పెన్షనర్లకు సర్కారు భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు మాట్లాడుతూ అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం మంజూరు చేయాలని, వయోవృద్ధుల సంరక్షణ చట్టం కింద సీనియర్ సిటిజన్స్ కోసం కౌన్సిల్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి జిల్లా కేంద్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో రూ.కోటితో వృద్ధాశ్రమాన్ని నిర్మిస్తున్నామని, వారికెప్పుడూ అండగా ఉంటామన్నారు. అలాగే వయోవృద్ధుల కేసుల పరిష్కారంలో జిల్లా నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంతరెడ్డి, ప్రకాశ్‌రావు, యాకూబ్, సత్యనారాయణ, భీమయ్య, కిషన్ పాల్గొన్నారు.

సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి


జయంతిలో పాల్గొన్న భక్తులు

సారంగాపూర్: మండలంలోని ధర్మనాయక్‌తండా గ్రామంలో శనివారం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ భూక్య సంతోష్, రాజేశ్, సంఘం అధ్యక్షుడు రవి, రాజన్న, తిరుపతి, గంగాధర్, రాజేశ్, ప్రవీణ్, రాజునాయక్, సురేశ్, దుబ్బనాయక్, జలపతి పాల్గొన్నారు.

నేడు జిల్లా కేంద్రంలో వేడుకలు..

జిల్లా కేంద్రంలోని బంజారా భవన్ వద్ద ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు ప్రతి లంబాడి బిడ్డ తరలిరావాలని జిల్లా బంజారా భవన్ అభివృద్ధి కమిటీ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ దశరథ్ నాయక్ కోరారు. గౌరవ అధ్యక్షుడు జవహర్ నాయక్, కార్యదర్శులు గోపాల్‌నాయక్, లచ్యనాయక్, మురళినాయక్, ప్రవీణ్‌నాయక్, రమేశ్ నాయక్ ఉన్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణంపై దృష్టిసారించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

రాయికల్: గ్రామాల్లోని ఇంటింటికీ ఇంకుడుగుంతల నిర్మాణంపై దృష్టిసారించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీవో సుష్మ పాల్గొన్నారు.

ప్రజలను ప్రోత్సహించాలి

కథలాపూర్: గ్రామాల్లో ఇంకుడుగుంతలు నిర్మించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని ఎంపీడీవో జనార్దన్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం కథలాపూర్ మండలకేంద్రంలో స్త్రీశక్తి భవన్‌లో అన్ని గ్రామాల కార్యదర్శులకు, మహిళా సంఘాల ప్రతినిధులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాల్లో వృథాగా నీరు పోకుండా, ఇంకుడు గుంతలకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అందుకోసం ప్రతి ఇంటికో ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీవో గంగాధర్, ఏపీఎం నరహరి, సీసీలు పాల్గొన్నారు.

ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ఎంపిక

జగిత్యాల: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించగా జిల్లా విద్యార్థి ఎంపికయ్యాడు. అన్ని జిల్లాల నుంచి 51 మంది విద్యార్థులు పాల్గొనగా జిల్లాలో కొడిమ్యాల మండలం రాంసాగర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన శైలెట్టి విజయ్ రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్, కోఆర్డినేటర్ కొక్కుల రాజేశ్, ఫిజికల్ సైన్స్ అధ్యక్షుడు మచ్చ రాజశేఖర్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించారు.

సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల: ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఫలితాల్లో జగిత్యాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. మానస స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చెందిన విద్యార్థులు మ్యాకల సుహాస్ 261/300, రాగిల్ల విశ్వతేజ 256/300 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రజితరావు, శ్రీధర్‌రావుతో పాటు పలువురు అభినందించారు.

జ్ఞాన అకాడమీ విద్యార్థులు..

జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో గల సైనిక్ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ పొందిన విద్యార్థులు సిద్ధార్థ 244, వంశీకుమార్ 239, మహేశ్వర్ 219 మార్కులు సాధించారు. వీరిని జ్ఞాన అకాడమీ డైరెక్టర్ కార్తీక్‌కుమార్ అభినందించారు.

కడకుంట్ల గంగారం సేవలు చిరస్మరణీయం


నివాళి అర్పిస్తున్న నాయకులు

కోరుట్లటౌన్: బీడీ కార్మికుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన కడకుంట్ల గంగారాం సేవలు చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర నేత చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సి.ప్రభాకర్ భవన్‌లో శనివారం గంగారాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఎన్నం రాధ, నేతలు అందె రామయ్య, సాంబార్ మహేశ్, రాజలింగం, పాషా, నసీర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి


పాఠశాలకు ఆంప్లిఫైర్, సౌండ్ బాక్స్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్తులు సహకరించాలని యూపీఎస్ హెచ్‌ఎం నునావత్ రాజు కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని కుస్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు 1997–98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆంప్లిఫైర్, సౌండ్ బాక్స్ అందజేశారు. టీచర్లు షాబాజ్ హుస్సేన్, సునీత, శృతి, గణేశ్, 1997–98 పూర్వ విద్యార్థులు పొట్టుపెల్లి చిన్నయ్య, ఈర రాజేందర్, సరికెల లింగారెడ్డి, దాసరి మల్లయ్య, గాజుల మహేశ్, రావుల సుధాకర్, రవీందర్ పాల్గొన్నారు.

గండి హన్మాన్ ఆలయంలో మాలధారణ

మెట్‌పల్లి: జిల్లా సరిహద్దులో ఉన్న గండి హన్మాన్ ఆలయంలో శనివారం 302 మంది భక్తులు పురోహితులు మాధవచారి చేతుల మీదుగా ఆంజనేయస్వామి మాలధారణ స్వీకరించారు. మాలధారణ కార్యక్రమంలో ఆలయానికి రూ.30,200 ఆదాయం సమకూరినట్లు ఈవో విక్రమ్ తెలిపారు.

వాల్గొండలో హనుమాన్ దీక్షలు ప్రారంభం

మల్లాపూర్: మండలంలోని వాల్గొండలో శనివారం హనుమాన్ దీక్షపీఠం వ్యవస్థాపకుడు, అర్చకులు బల్యపెల్లి శశికాంత్ శర్మ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్ష మాలధారణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శశికాంత్ శర్మ హనుమాన్ దీక్ష నియమ నిబంధనలు భక్తులకు వివరించారు. అనంతరం 200మంది భక్తులు మాలధారణ స్వీకరించారు.